సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
గురువారం । 16 । మే । 2024



చీనీ టన్ను రూ.36 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో బుధవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.36 వేలు, కనిష్టం రూ.14 వేల ప్రకారం క్రయవిక్రయాలు జరిగాయి.



హోరాహోరీగా 'ఏసీఎల్ -2'

అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆర్డీటీ స్టేడియంలో నిర్వహిస్తున్న అనంతపురం లీగ్-2 పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. 10లో

గరిష్టం/కనిష్టం
38.1°/22.8°

జిల్లావ్యాప్తంగా బుధవారం ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత కూడా తగ్గింది. గంటకు 6 నుంచి 10 కి.మీ.వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

నేటి నుంచి బీసీజీ వ్యాక్సినేషన్



బీసీజీ వ్యాక్సినేషన్‌పై సమీక్షిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ మంజువాణి

ప్రశాంతి నిలయం: క్షయ వ్యాధిని పూర్తిగా నిర్మూలించేందుకు ఈనెల 16వ తేదీ (గురువారం) నుంచి జిల్లాలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమ నిర్వహణపై బుధవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎంహెచ్‌ఓ) డాక్టర్ మంజువాణి తన కార్యాలయంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్‌లో భాగంగా 18 సంవత్సరాల వయస్సు పైబడిన వారందరికీ టీకా వేస్తారన్నారు. ఈనెల 16న ప్రారంభం కానున్న వ్యాక్సినేషన్ మూడు నెలల పాటు కొనసాగుతుందన్నారు. ప్రతి గురువారం జిల్లాలోని 544 సచివాలయాల్లో వ్యాక్సినేషన్ చేస్తారన్నారు. ప్రతి ఒక్కరూ వ్యాక్సిన్ వేయించుకోవాలని సూచించారు. సమీక్షలో జిల్లా వ్యాక్సినేషన్ అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్, జిల్లా టీబీ నివారణ అధికారి డాక్టర్ తిప్పయ్య, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్లు పాల్గొన్నారు.

కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే చర్యలు

- జిల్లా ఆహార భద్రత అధికారి తస్లీం



హోటల్‌లో ఆహార పదార్థాలను పరిశీలిస్తున్న ఆహార భద్రత అధికారి తస్లీం

హిందూపురం టౌన్: ప్రజారోగ్యానికి భంగం కలిగిస్తూ కల్తీ ఆహార పదార్థాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఆహార భద్రత అధికారిణి తస్లీం హెచ్చరించారు. బుధవారం ఆమె పట్టణంలోని 'సరిగమ', తాడిపత్రి బిర్యాని రెస్టారెంట్లను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా రెస్టారెంట్లలో వండిన ఆహార పదార్థాలను, వండడానికి సిద్ధం చేసిన పదార్థాలను పరిశీలించారు. కొన్ని పదార్థాల నమూనాలు సేకరించారు. ఈ సందర్భంగా తస్లీం మాట్లాడుతూ, రెస్టారెంట్ నిర్వాహకులు ఆహార భద్రత శాఖ అనుమతులు తీసుకోకపోతే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆహార పదార్థాల్లో నాణ్యత లేకపోయినా, కాలం చెల్లిన ఆహార పదార్థాలను విక్రయించినా ఆహార భద్రత ప్రమాణాల చట్టం కింద కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.

నేడు ఏపీఈఏపీ సెట్

అనంతపురం: ఏపీ ఈఏపీసెట్ గురువారం జరగనుంది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో మొత్తం 29,025 మంది విద్యార్థులు దరఖాస్తు చేశారు. అనంతపురం జిల్లాలకు సంబంధించి మొత్తం 8 కేంద్రాలు ఏర్పాటు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేశారు. ఈ నెల 23 వరకు రెండు సెషన్లలో పరీక్ష జరగనుంది. నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని అధికారులు స్పష్టం చేశారు.

ఉపాధి ఉత్సాహం

వలసలు నివారించేందుకు ప్రవేశపెట్టిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిరుపేదలకు వరంగా మారింది. ఉపాధి కోసం నగరాలకు వెళ్లిన వారంతా కరోనా సంక్షోభంలో స్వగ్రామాలకు రాగా, వారందరికీ అధికారులు 'ఉపాధి' కల్పించారు. రోజువారీ కూలి రూ.250 తగ్గకుండా ఇవ్వడంతో పాటు సకాలంలో బిల్లులు చెల్లిస్తుండగా, ఉపాధి పనులకు వచ్చే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.

- జిల్లాలో లక్ష మందికిపైగా పని
- ఇప్పటికే 18 లక్షల పని దినాలు పూర్తి
- వలసలకు అడ్డుకట్ట వేసిన ప్రభుత్వం
- పెండింగు లేకుండా వేతనాల చెల్లింపు
- కూలీల ఖాతాల్లో ఇప్పటికే రూ.45 కోట్లు జమ
- పనుల వద్ద కనీస వసతుల ఏర్పాటు



ఉపాధి పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ విజయప్రసాద్ (ఫైల్)

సాక్షి, పుట్టపర్తి

ఉపాధి హామీ పథకం అమలులో మన జిల్లా ప్రత్యేకతను చాటింది. ఐదు నెలల కాలానికి ఉన్నతాధికారులు 50 లక్షల పని దినాలు లక్ష్యం విధించగా, ఇప్పటికే సుమారు 18 లక్షల పని దినాలు పూర్తయ్యాయి. కూలి డబ్బులు కూడా పెండింగు లేకుండా ఎప్పటికప్పుడు చెల్లిస్తున్నారు. రోజూ సగటున లక్ష మంది కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు. కరోనా లాక్‌డౌన్ సమయంలో ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు చాలా మంది స్వగ్రామాలకు చేరుకున్నారు. వారిలో ఎక్కువ మంది బతుకుదెరువు కోసం ఉపాధిహామీ పనుల వైపు మొగ్గు చూపారు. ఇప్పటికే సుమారు రూ.45 కోట్లు వేతన రూపంలో కూలీలకు చెల్లించారు.

ఆపత్కాలంలో అండగా..

కరోనా ముందువరకు గ్రామాల్లో నిరుపేదలు మాత్రమే ఉపాధి హామీ పనులపై ఆధారపడేవారు. మెరుగైన వేతనం కోసం ఇంకొందరు బెంగళూరు, హైదరాబాద్, కేరళ, బళ్లారి తదితర ప్రాంతాలకు వలస వెళ్లేవారు. కానీ కోవిడ్ సంక్షోభంలో అందరూ స్వగ్రామాలకు చేరుకున్నారు. ఆ తర్వాత కూడా మెట్రోపాలిటన్ సిటీలకు మళ్లీ వెళ్లేందుకు ఇష్టపడలేదు. స్థానికంగానే పనులు చేసుకుంటూ కుటుంబీకులతో కలిసి ఉంటున్నారు. ఇలాంటి వారికి ఉపాధి హామీ పనులు వరంగా మారాయి. ఈక్రమంలో చదువుకున్నవారు సైతం ఉపాధి పనుల కోసం క్యూ కట్టారు. వారిలో పీజీ, డిగ్రీలు పూర్తిచేసిన ఉన్నత విద్యావంతులు ఎందరో ఉన్నారు. ఉపాధి హామీ జాబ్‌కార్డుల కోసం నమోదు చేసుకుంటున్న వారి సంఖ్య భారీగా పెరగడానికి ఇది కూడా ఒక కారణంగా చెప్పవచ్చు.

పారదర్శకంగా అమలు..

ప్రభుత్వం పెద్ద ఎత్తున పనులు కల్పిస్తుండటంతో కూలీలు కూడా ఉత్సాహంగా హాజరు అవుతున్నారు. జిల్లాలో సగటున రోజుకు లక్ష మంది కూలీలు పనులకు వెళ్తున్నారు. వీరిలో చాలా మంది గతేడాది వంద రోజులు పనులు పూర్తి చేసిన వారు ఉండటం విశేషం. టీడీపీ హయాంలో ఉపాధి హామీ పనుల్లో భారీ అక్రమాలు చోటు చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ పథకం నిధులు తెలుగు తమ్ముళ్లకు ఫలహారంగా మారాయనే విమర్శలు కూడా వచ్చాయి. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని పారదర్శకంగా అమలు చేస్తోంది. నిరుపేదలకు స్థానికంగానే ఉపాధి కల్పిస్తూ వలసలు పూర్తిగా తగ్గించింది.

సకాలంలోనే బిల్లులు



ఉపాధి కూలీలకు గిట్టుబాటు కూలి కల్పించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లపైనే ఉంది. ప్రతి పంచాయతీలో పని దినాలు పూర్తి చేయాలి. కచ్చితమైన కొలతలు ఇవ్వాలి. రోజు కూలి రూ.250 పైగా పడేలా చూడాల్సిన బాధ్యత కూడా టీఏ, ఎఫ్ఏలదే. బిల్లులు సకాలంలో చెల్లిస్తున్నాం.

– విజయప్రసాద్, పీడీ, డ్వామా

జిల్లాలో 144 సెక్షన్

- నేటి నుంచి జూన్ 4 వరకూ అమలు
- ఎస్పీ మాధవరెడ్డి వెల్లడి



మాధవరెడ్డి, ఎస్పీ

పుట్టపర్తి టౌన్: జిల్లాలో బుధవారం నుంచి ఓట్ల లెక్కింపు పూర్తయ్యేవరకూ అంటే జూన్ 4వ తేదీ వరకూ 144 సెక్షన్ అమలులో ఉంటుందని ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి లేదన్నారు. హింసాత్మక ఘటనలకు, రెచ్చగొట్టేలా ఏ ఒక్కరూ వ్యవహరించకూడదన్నారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ హెచ్చరించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లా యంత్రాంగం సమష్టి కృషి, రాజకీయ పార్టీ నేతల సహకారం, ప్రజల స్వచ్ఛంద మద్దతుతో జిల్లాలో ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయన్నారు. పోలింగ్ ముగిసినందున అన్ని రాజకీయ పార్టీల నాయకులు సంయమనం పాటించాలని, హింసాత్మక సంఘటనలకు దూరంగా ఉండాలన్నారు. సోషల్ మీడియాలో సైతం రెచ్చగొట్టే పోస్టులు, వ్యాఖ్యలు చేయకూడదన్నారు. ఎక్కడా గుంపులు, గుంపులుగా ఉండకూడదని, అల్లర్లు, ఘర్షణ జోలికి వెళ్లకూడదన్నారు. అనుమతులు లేకుండా ఎక్కడా సభలు, ప్రచారాలు నిర్వహించకూడదన్నారు. అయితే పెళ్లిళ్లకు, అంత్యక్రియలకు మినహాయింపు ఉంటుందన్నారు. జూన్ 4వ తేదీ కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యేంత వరకూ జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. అన్ని రాజకీయ పార్టీ నాయకులు సహరించాలని కోరారు. హద్దు మీరితే కఠిన చర్యలు తప్పవన్నారు.

స్ట్రాంగ్‌రూంలకు పటిష్ట భద్రత



బిట్ కళాశాల స్ట్రాంగ్‌రూం వద్ద భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

- మూడంచెల భద్రత... సాయుధ బలగాల పహారా
- అవాంఛనీయ సంఘటనలకు పాల్పడితే కఠిన చర్యలు
- హెచ్చరించిన ఎస్పీ మాధవరెడ్డి

హిందూపురం/హిందూపురం అర్బన్: ఈవీఎంలు భద్రపర్చిన స్ట్రాంగ్ రూంలకు మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు ఎస్పీ మాధవరెడ్డి తెలిపారు. కేంద్ర సాయుధ బలగాలు, ఆర్మ్‌డ్ రిజర్వ్‌డ్ బలగాలు, సివిల్ పోలీసులను మోహరించామన్నారు. బుధవారం ఆయన హిందూపురం సమీపంలోని 'బిట్' కళాశాల, లేపాక్షి సమీపంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూంలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. స్ట్రాంగ్‌రూంల వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల కమాండ్ కంట్రోల్‌ను పరిశీలించారు. స్ట్రాంగ్ రూంలు ఏర్పాటు చేసిన ప్రాంతాల్లో సీసీ టీవీ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఉంటుందన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా జనరేటర్లు సైతం ఏర్పాటు చేశామన్నారు. ఎవరైనా ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్ట్రాంగ్ రూం పరిసర ప్రాంతాల్లో సంచరించేందుకు ఎవరికీ అనుమతిలేదన్నారు. ఓట్ల లెక్కింపు కోసం జూన్ 4న జిల్లా ఎన్నికల అధికారి, అభ్యర్థుల సమక్షంలో స్ట్రాంగ్ రూంలు తెరిచి ఈవీఎంలను బయటకు తీస్తామన్నారు. తప్పుడు ప్రచారం చేసినా, అవాంఛనీయ సంఘటనలకు పాల్పడినా చర్యలు తీవ్రంగా ఉంటాయని హెచ్చరించారు.

'కూటమి' నేత మట్టి దందా



ముచ్చురామి వంక నుంచి జేసీబీతో మట్టిని తవ్వుతున్న దృశ్యం



వంక నుంచి తీసుకువచ్చిన మట్టితో భూమి చదును చేస్తున్న దృశ్యం

- వంకలోని మట్టిని యంత్రాలతో తరలింపు
- చోద్యం చూస్తున్న అధికారులు

ధర్మవరం: అందరూ ఎన్నికల హడావుడిలో ఉంటే.. ధర్మవరం మండలానికి చెందిన ఓ కూటమి నాయకుడు మట్టి దందాలో మునిగిపోయాడు. మండలంలోని ముచ్చురామి గ్రామం వద్ద జాతీయ రహదారికి సమీపంలో వెంచర్ వేసిన సదరు నాయకుడు.. ఇటీవలే భూమిని చదును చేశాడు. అయితే ఎగుడుదిగుడుగా ఉండటంతో సమీపంలో ఉన్న వంకలోని మట్టి తరలిస్తున్నాడు. రాత్రీపగలు తేడా లేకుండా జేసీబీ యంత్రాలు ఉపయోగించి టిప్పర్ల ద్వారా మట్టిని తీసుకెళ్తున్నాడు. సమీప పొలాల రైతులు తీవ్ర అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నా... సదరు నేత అవేమీ పట్టించుకోవడం లేదు. వంకలోని మట్టిని తరలించడం వల్ల సమీపంలోని వ్యవసాయ బోరు బావుల్లో నీటి మట్టం తగ్గే అవకాశాలు ఉన్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇంత జరుగుతున్నా... రెవెన్యూ అధికారులు, పోలీసులు కన్నెత్తి చూడటం లేదు. ఇప్పటికైనా స్పందించి వంకలోని మట్టిని తరలించకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హత్య కేసులో ముద్దాయిలకు జీవిత ఖైదు

ముదిగుబ్బ: ఓ హత్య కేసులో ముద్దాయిలకు అనంతపురం జిల్లా సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. ముదిగుబ్బ సీఐ యతీంద్ర తెలిపిన వివరాల ప్రకారం... ముదిగుబ్బ మండలం ఎస్.బండ్లపల్లి గ్రామానికి చెందిన సాకే గంగరాజుతో తన భార్య వివాహేతర సంబంధం కొనసాగిస్తోందని తలుపుల మండలం సుబ్బనగుంతపల్లికి చెందిన గుజ్జల గంగప్ప అనుమానించాడు. దీంతో గంగరాజును హత్య చేసేందుకు ప్లాన్ చేశాడు. ఇందుకు తనమిత్రుడు లోమడ ఆంజనేయులు సాయం కోరాడు. అనంతరం గంగరాజుతో స్నేహం చేశాడు. ముందుగానే వేసిన ప్లాన్‌లో భాగంగా 2016 మార్చి 2వ తేదీన గంగప్ప, అతని మిత్రుడు లోమడ ఆంజనేయులు సాకే గంగరాజు వద్దకు వచ్చారు. మేకలు కొనడానికి ముదిగుబ్బకు వెళ్దామని కోరారు. వారి మాటలు నమ్మిన గంగరాజు వారితో కలిసి బైక్‌పై బయలుదేరాడు. అయితే గంగరాజును మాటల్లో పెట్టి ముదిగుబ్బ ఓల్డ్ టౌన్ రైల్వే గేటు సమీపంలోని మిల్లు వెనుక వైపు వరకూ తీసుకువెళ్లారు. అక్కడ బైక్ నిలిపి గంగప్ప అతని మిత్రుడు ఆంజనేయులు వెంట తెచ్చుకున్న కొడవళ్లతో గంగరాజును విచక్షణా రహితంగా నరికి చంపి పారిపోయారు. మృతుడి సోదరుడు సాకే వెంగముని ఫిర్యాదు మేరకు అప్పటి ముదిగుబ్బ ఎస్ఐ జయా నాయక్, నల్లమాడ సీఐ శివరాముడు కేసు నమోదు చేశారు. ముద్దాయిలను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. ఈ కేసు విచారించిన అనంతపురం జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి శోభారాణి బుధవారం తీర్పు వెలువరించారు. ముద్దాయిలు గుజ్జల గంగప్ప, లోమడ ఆంజనేయులు జీవిత ఖైదు విధించడంతో పాటు ఒక్కొక్కరికి రూ.5 వేల చొప్పున జరిమానా విధించారు. ముద్దాయిలకు శిక్షపడే విధంగా కేసు దర్యాప్తు చేసిన అధికారులు శివరాముడు, జయా నాయక్, ప్రస్తుత ముదిగుబ్బ సీఐ యతీంద్ర, ఏఎస్ఐ వెంకటగిరి, హెచ్‌సీ గంగాధర్‌లను ఎస్పీ మాధవరెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

పరిశ్రమలో భారీ అగ్ని ప్రమాదం



ఎగిసి పడుతున్న మంటలు



ఎస్‌ఎల్‌ఏపీ పరిశ్రమలో బూడిదైన పరికరాలు

సోమందేపల్లి: మండలంలోని గుడిపల్లి పారిశ్రామికవాడలో ఏర్పాటు చేసిన ఎస్‌ఎల్‌ఏపీ పరిశ్రమలో బుధవారం రాత్రి భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో పొగ కారణంగా ఇద్దరు కార్మికులు అస్వస్థతకు గురయ్యారు. వివరాల్లోకి వెళితే... ఇటీవల ఎస్‌ఎల్‌ఏపీ పరిశ్రమ విస్తరణలో పనులు చేపట్టారు. బుధవారం వెల్డింగ్ పనులు చేస్తుండగా...నిప్పురవ్వలు సమీపంలోని గుజరీ సామగ్రిపై పడ్డాయి. క్షణాల్లోనే మంటలు వ్యాపించగా రూ.లక్షల్లో ఆస్తి నష్టం జరిగింది. ఈ సమయంలో అక్కడే పనిచేస్తున్న ఇద్దరు కార్మికులు పొగ కారణంగా ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారు. వారిని అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పెనుకొండ ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలు ఆర్పారు. ఎస్ఐ విజయ్ కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు.

రెచ్చిపోయిన పచ్చ మూకలు

- వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్‌పై దాడి



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కలకందప్ప

పెనుకొండ రూరల్: పోలింగ్ తర్వాత పచ్చ మూకలు రెచ్చిపోయాయి. ఓటమి భయంతో వైఎస్సార్ సీపీ నేతలను లక్ష్యంగా చేసుకుని దాడులకు తెగబడ్డాయి. ఈ క్రమంలో బుధవారం రాత్రి పెనుకొండ మండలం నాగలూరు పంచాయతీ బండపల్లిలో వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్ కలకందప్పపై దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. బాధితుడు తెలిపిన వివరాల మేరకు.. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ బూత్ కన్వీనర్ కలకందప్ప క్రియాశీలకంగా పనిచేశారు. పోలింగ్ రోజున టీడీపీ నేతల దౌర్జన్యాలను అడ్డుకున్నారు. దీంతో గ్రామానికి చెందిన టీడీపీ నేతలు అతనిపై కక్ష గట్టారు. బుధవారం కలకందప్ప వ్యక్తిగత పనిపై మావటూరుకు వెళ్లి.. సాయంత్రం తిరిగి వస్తుండగా.. టీడీపీ నేతలు రామచంద్రప్ప, గజేంద్ర, ప్రసాద్, రామాంజినప్ప, ప్రభన్న అడ్డుకుని దాడి చేశారు. గ్రామంలో ఉండాలంటే టీడీపీలో చేరాలని, లేకపోతే ఊరు విడిచి వెళ్లాలని హెచ్చరించారు. దీంతో బాధితుడు కలకందప్ప నేరుగా పోలీసు స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. అనంతరం చికిత్స నిమిత్తం ఆస్పత్రిలో చేరారు.

ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి అర్బన్: పదో తరగతి, ఇంటర్మీడియెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబరచిన కురుబ విద్యార్థులకు కనకదాస ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్నట్లు కనకదాస ఉద్యోగుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు గోపాల్, అధ్యక్షుడు పూజారి రెడ్డెప్ప ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు 2023–24 విద్యా సంవత్సరంలో ఇంటర్‌లో 800 మార్కులపైన, పదో తరగతిలో 450 మార్కులపైన, ప్రైవేటు పాఠశాలల్లో చదివిన వారైతే 500 మార్కులపైన సాధించిన వారు అర్హులన్నారు. అలాగే నీట్, జేఈఈలో ప్రతిభ చాటిన కురుబ విద్యార్థులకూ పురస్కారాలు అందిస్తామని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు ఈనెల 22వ తేదీలోపు హిందూపురం వక్కల బజార్‌లోని శ్రీనివాస బుక్‌స్టాల్‌లో అందజేయాలన్నారు. దరఖాస్తుతో పాటు మార్కుల జాబితా, కుల ధ్రువీకరణ పత్రం, ఫోన్ నంబర్ జత చేయాలన్నారు. వివరాలకు 8919729330, 9441252569 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో లక్ష్మీచెన్నకేశవస్వామి



ధ్వజ పటాన్ని తీసుకువస్తున్న అర్చకులు, దాతలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో కొలువైన లక్ష్మీచెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలను పురస్కరించుకుని శమీనారాయణస్వామి ఆలయంలో సాంప్రదాయబద్ధంగా గరుడ చిత్రపటానికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బ్రహ్మోత్సవాలకు బ్రహ్మాది దేవతలకు ఆహ్వానం పలుకుతూ అర్చకులు కోనేరాచార్యులు, మకరందబాబు, భానుప్రకాష్ తదితరులు వేదమంత్రాల నడుమ ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ వేడుకకు ఉభయదారులుగా గజనాణ్యం పట్టుసాలే సంఘం వారు వ్యవహరించారు.

క్లుప్తంగా

మతిస్థిమితం లేని వ్యక్తి హత్య

హిందూపురం అర్బన్: మతి స్థిమితం లేని వ్యక్తిని కిరాతకంగా హతమార్చిన ఘటన హిందూపురంలో సంచలనం రేకెత్తించింది. పోలీసులు తెలిపిన మేరకు... కర్ణాటకలోని దొడ్డబళ్లాపురానికి చెందిన సెల్వకుమార్ (54) మతి స్థిమితం లేక బాధపడుతున్నాడు. దీంతో ఆయనను అన్న శివకుమార్ పిలుచుకొచ్చి మూడేళ్ల క్రితం పరిగి మండలం మోదా గేట్ వద్ద ఉన్న సదానంద వృద్ధాశ్రమంలో చేర్పించాడు. అప్పటి నుంచి వృద్ధాశ్రమంలోనే ఆశ్రయం పొందుతున్న సెల్వకుమార్‌ను ఆదివారం ఓ వ్యక్తి వచ్చి బయటకు పిలుచుకెళ్లాడు. ఆ తర్వాత సెల్వకుమార్ ఆచూకీ లేకుండా పోయింది. బుధవారం హిందూపురంలోని పరిగి రోడ్డు మోతుకపల్లి వద్ద ఉన్న అక్కమ్మ గుడి సమీపంలో సెల్వకుమార్ మృతదేహాన్ని స్థానికులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మంగళవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాయితో మోది హతమార్చినట్లుగా ప్రాథమిక దర్యాప్తులో నిర్ధారణ అయింది. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


అలీబాషా (ఫైల్)

పామిడి: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... పామిడిలోని తలవాలకట్ట వీధికి చెందిన కట్టుబడి నబీరసూల్ కుమారుడు అలీబాషా (26) బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్నాడు. రెండేళ్ల క్రితం కర్నూలు జిల్లా పత్తికొండకు చెందిన షహీనాతో వివాహమైంది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. తన అవసరాలకు మించి అప్పులు చేసిన అలీబాషా.... వాటిని తీర్చే మార్గం కానరాక బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. షహీన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వ్యక్తి బలవన్మరణం


వెంకట్రాముడు (ఫైల్)

బుక్కరాయసముద్రం: అప్పులు తీర్చే మార్గం కానరాక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... బుక్కరాయసముద్రం మండలం దయ్యాలకుంటపల్లికి చెందిన సెంగల వెంకట్రాముడు (50) వ్యవసాయ పనులతో జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమార్తెలు, ఓ కుమారుడు ఉన్నారు. తనకున్న 6 ఎకరాల్లో పంటల సాగుకు, కుమార్తెల పెళ్లిలకు దాదాపు రూ.15 లక్షల వరకు అప్పులు చేశాడు. ఈ అప్పులు తీర్చే మార్గం కానరాక మానసిక వేదనకు లోనైన ఆయన మంగళవారం రాత్రి తోటలోకి వెళ్లి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

వేసవి దుక్కులు.. లాభాలు దక్కు

- వాలుకు అడ్డంగా కాంటూరి సేద్యం పనులు చేసుకోండి
- వాన నీటిని ఎక్కడిక్కడ ఇంకేలా చేయాలి
- ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు బి.సహదేవరెడ్డి, డాక్టర్ నారాయణస్వామి సూచనలు


నేల, నీటి సంరక్షణకు వేసవి దుక్కులు, కాంటూరు సేద్యపు పనులు ఇలా

అనంతపురం అగ్రికల్చర్: 'దున్నకుండా సాగుచేస్తే.. కొయ్యకుండా పోతుంది!' అనేది తెలుగు నానుడి. ఏ పంట వేయాలన్నా ముందుగా దుక్కి దున్నాల్సిందే. విత్తేందుకు అనుకూలంగా పొలాన్ని సిద్ధం చేసుకోవాలి. దుక్కి చేయకుండా వదిలేయడంవల్ల భూమి చీడపీడలకు ఆవాసంగా మారి సత్తువ కోల్పోతుంది. ముఢి పోషకాల లోపం ఏర్పడి, తర్వాతి పంటకు భారీగా ఎరువులు వేయాల్సి వస్తుంది. అందుకే.. రైతులు వేసవిలో లోతు దుక్కుల మీద దృష్టి పెట్టాలని ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ బి.సహదేవరెడ్డి, డాక్టర్ నారాయణస్వామి సూచిస్తున్నారు. జూన్ నుంచి ఖరీఫ్–2024 'ముంగారు' మొదలు కానుండటంతో ఇటీవల కురిసిన వర్షాల ఆధారంగా వేసవి దుక్కులు మొదలు పెట్టాలంటున్నారు. మెట్ట పొలాలు అధికంగా ఉన్న ఉమ్మడి అనంతపురం జిల్లాలో వ్యవసాయం లాభసాటి కావాలంటే లోతుగా దుక్కి చేయడం, నేల, నీటి సంరక్షణకు వాన నీటిని ఎక్కడిక్కడ ఇంకేలా 'కాంటూరి' సేద్యం పనులు చేసుకోవాలని సూచించారు. రాగల నాలుగు రోజులూ ఆకాశం మేఘావృతమై మోస్తరు నుంచి తేలికపాటి వర్షసూచన ఉందన్నారు.

75 శాతం వర్షాధారం..

ఉమ్మడి జిల్లాలో మొత్తం పంట భూమిలో 75 శాతం విస్తీర్ణంలో రైతులు కేవలం వర్షాలపై (మెట్ట సేద్యం) ఆధారపడి సాగు చేస్తున్నారు. ఎక్కువగా ఎర్ర, చల్కా నేలలు ఉన్నాయి. నైరుతీ ప్రభావంతో కురిసే వర్షాలపై ఉమ్మడి జిల్లా పరిధిలో 7 లక్షల నుంచి 8 లక్షల హెక్టార్ల ఖరీఫ్ ఆధారపడి ఉంది. రుతుపవనాలు నిర్ణీత సమయం కన్నా ముందుగా, లేకుంటే ఆలస్యం కావడం.... త్వరగా నిష్క్రమించడం, తక్కువ వర్షాలు కురవడం, అనిశ్చితి వర్షాలు, పంట కాలంలో దీర్ఘకాలం బెట్ట పరిస్థితులు ఏర్పడటం, ఒక్కోసారి విరామం లేకుండా అతివృష్టి సంభవించడం లాంటివి వ్యవసాయాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తున్నాయి. ఎంత వర్షం కురిసినా అందులో 10 నుంచి 20 శాతం మాత్రమే భూమిలోకి ఇంకిపోయి మిగతాది ప్రవాహం, ఒరవడి రూపంలో కొట్టుకెళ్లి వృథా అవుతుంటాయి. ఇలా ప్రవాహం రూపంలో వెళ్లే వర్షపునీటితో పాటు భూమిపై సారవంతమైన పొర కొట్టుకుపోవడం వల్ల పోషకాల లోపం ఏర్పడి క్రమంగా భూమి ఉత్పాదకశక్తి కోల్పోయి పంట దిగుబడులు తగ్గిపోతాయని శాస్త్రవేత్తలు అంటున్నారు.

లోదుక్కులతో విస్తృత ప్రయోజనాలు..

వేసవిలో కురిసే వర్షాలను ఉపయోగించుకుని పొలాల్లో వాలుకు అడ్డంగా ఎర్ర నేలలో ఒక మీటరు, నల్లరేగళ్లలో రెండు మీటర్లు చొప్పున లోతుగా దుక్కులు చేసుకుంటే అనేక ప్రయోజనాలు ఉన్నాయి. దీన్నే కాంటూరు సేద్యం అంటారు. భూమిలో గట్టిపొరను కదలించడం ద్వారా పంటలకు కీడు చేసే పురుగులు చాలా వరకు కోశస్థ దశలోనే నశిస్తాయి. పంట కాలంలో చీడపీడలు, తెగుళ్ల ఉధృతి బాగా తగ్గుతుంది. నేల ఎండుతూ... ఆరుతూ ఉంటే పంటకు మేలు చేసే సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయి. అలాగే వర్షపు నీరు ఎక్కడిక్కడ ఇంకిపోయి నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుంది. బెట్ట ఏర్పడకుండా కాపాడుకోవచ్చు. సారవంతమైన మట్టి కొట్టుకుపోకుండా ఉంటుంది. కలుపు సమస్య బాగా తగ్గిపోతుంది. అంతేకాక గాలిలో నైట్రేట్ రూపంలో ఉన్న నత్రజని వర్షపు నీటితో పాటు నేలకు అందడం ద్వారా భూసారం పెరుగుతుంది. విత్తనం వేయడానికి ముందు రెండు సార్లు నేలను బాగా దుక్కి చేసుకుంటే పంట దిగుబడులు గణనీయంగా పెరుగుతాయి.

కిట్టయ్య మనసు బంగారం


కిట్టయ్య ఏర్పాటు చేసిన నీటి తొట్టెలో దాహం తీర్చుకుంటున్న కోతులు

పెద్దపప్పూరు: పుట్టింది నిరుపేద కుటుంబంలోనే అయినా తనకున్నంతలో మూగజీవాల ఆకలి దప్పికలు తీరుస్తున్నాడు కిట్టయ్య. దాదాపు 15 సంవత్సరాలుగా ఈ సేవ కొనసాగిస్తూ వస్తున్నాడు.

కిట్టయ్య రాక కోసం ఎదురుచూపు..

నార్పల మండలం నాయనపల్లి గ్రామానికి చెందిన కిట్టయ్య రాక కోసం ముచ్చుకోట అటవీ ప్రాంతంలోని మూగజీవాలు ఎదురు చూస్తూ ఉంటాయి. అరటి చెట్లకు సపోర్టుగా పెట్టే కట్టెల విక్రయంతో జీవనం సాగిస్తున్న ఆయనకు ఇద్దరు కుమారులు ఉన్నారు. రోజూ 8 కిలోల బెల్లం అన్నం, వ్యాపారుల నుంచి సేకరించిన వివిధ రకాల పండ్లు, బ్రెడ్డును తన సొంత ఆటోలో వేసుకుని కుమారులు సాయికుమార్, గిరీష్ కుమార్‌తో కలసి ముచ్చుకోట అటవీ ప్రాంతానికి వెళుతుంటారు. ఇలా రోజూ రెండు పూటలా క్రమం తప్పకుండా అటవీ ప్రాంతానికి చేరుకుని ఆటో హారన్ కొట్టగానే ఎక్కడున్న కోతులు ఒక్కసారిగా అక్కడకు చేరుకుంటాయి. కిట్టయ్య అందించే ఆహారాన్ని కడుపార తిన్న తర్వాత నీటి తొట్లలో ఉన్న నీరు తాగి తిరిగి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోతుంటాయి. నీటి తొట్లను సైతం దాతల సహకారంతో కిట్టయ్యనే ఏర్పాటు చేశాడు. రెండు పూటలా ఓ డ్రమ్ము నీటిని తీసుకెళ్లి తొట్లను నింపుతుంటాడు. అటుగా వెళుతున్న వారు కిట్టయ్య సేవ చూసి అభినందిస్తున్నారు.

సామాన్యుడిలా ఈరలక్కప్ప


టీ బంక్ వద్ద స్థానికులతో కలసి టీ తాగుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి ఈరలక్కప్ప

గుడిబండ: మడకశిర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా వైఎస్సార్‌సీపీ ప్రకటించినప్పటి నుంచి రోజూ జనసందోహం మధ్య బిజీబిజీగా గడుపుతూ వచ్చిన ఈరలక్కప్ప బుధవారం ఓ సామాన్యుడిలా మారిపోయారు. ఎన్నికల పోలింగ్ ముగియడంతో స్థానికులు, పార్టీ కార్యకర్తలతో సరదాగా గడుపుతున్నారు. బుధవారం ఉదయం గుడిబండలోని ఓ టీ బంక్ వద్దకు చేరుకుని అందరిలో తానూ ఒక్కడినంటూ కలిసి పోయి తేనీరు సేవించారు. ఈ సందర్భంగా ఆయన వెంట జెడ్పీటీసీ భూతరాజు, పార్టీ మండల కన్వీనర్ డీఎల్ యంజారేగౌడు, సర్పంచ్ కరుణాకర్‌గౌడు, వైఎస్సార్‌సీపీ నాయకులు బీహెచ్ రాయుడు, నాగరాజు, రమేష్, తిప్పేస్వామి తదితరులు ఉన్నారు.

హోరాహోరీగా 'ఏసీఎల్ -2'

అనంతపురం: జిల్లా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అనంతపురం క్రికెట్ లీగ్ -2 హోరాహోరీగా సాగుతోంది. బుధవారం దినేష్ గ్రానైట్స్, యునైటెడ్ చాంపియన్ క్రికెట్ క్లబ్‌ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో టాస్ గెలిచి దినేష్ జట్టు బ్యాటింగ్ చేసింది. 18.5 ఓవర్లలో 144 పరుగులు వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని బ్యాటర్ ఆష్రఫ్ 47 బంతుల్లో 3 ఫోర్లు, 6 సిక్సర్లతో 63 పరుగులు చేశాడు. యునైటెడ్ జట్టు బౌలర్ రాజకుల్లాయప్ప నాలుగు వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన యునైటెడ్ జట్టు 17.5 ఓవర్లలో 118 పరుగుల వద్ద చతికిలబడింది. జట్టులో అర్జున్‌టెండూల్కర్ 20 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్సర్లతో 41 పరుగులు సాధించారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును ఆష్రఫ్‌కు ప్రకటించారు. అలాగే అనంత రైజింగ్ స్టార్, ఇండియన్ సిక్సర్స్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన రైజింగ్ స్టార్ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 169 పరుగులు చేసింది. దినేష్ వర్మ 33 బంతుల్లో 4 ఫోర్లు, ఒక సిక్సర్‌తో 37 పరుగులు, బి. ప్రశాంత్ 46 బంతుల్లో 52 పరుగులు, ఎంకే దత్తారెడ్డి 23 బంతుల్లో 33 పరుగులు సాధించారు. అనంతరం బ్యాటింగ్ చేసిన ఇండియన్ సిక్సర్స్ జట్టు నిర్ణీత 20 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి 157 పరుగులు సాధించి ఓటమి పాలైంది.

ముంగారుకు సన్నద్ధం

- జిల్లాలో చల్లబడిన వాతావరణం
- సాగుకు సిద్ధమవుతున్న రైతులు
- ఎక్కువ విస్తీర్ణంలో వేరుశనగ సాగుకు అవకాశం
- త్వరలో సబ్సిడీ వేరుశనగకు రిజిస్ట్రేషన్లు


బోరు నుంచి పుష్కలంగా వస్తున్న నీరు

పుట్టపర్తి అర్బన్: రెండు, మూడు రోజులుగా జిల్లా వ్యాప్తంగా మోస్తరు వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ముంగారు సేద్యానికి రైతన్నలు సన్నద్ధమవుతున్నారు. మరోవైపు విత్తన పంపిణీ ఏర్పాట్లపై వ్యవసాయశాఖ దృష్టి సారించింది. రైతులకు అవసరమైన విత్తన వేరుశనగ, కందులు, పచ్చిరొట్ట విత్తనాలు, పెసలు, అలసంద, రాగులు, సజ్జ, మొక్కజొన్న తదితర వాటిని రాయితీతో పంపిణీ చేసేందుకు చర్యలు చేపట్టింది. ఇన్నాళ్లు ఎన్నికల విధుల్లో ఉన్న అధికారులు ఈనెల 13న పోలింగ్ ముగిసిన నేపథ్యంలో విత్తన సన్నాహక చర్యలపై దృష్టి సారించారు. కొందరు జూన్ రెండు, మూడో వారంలోనే ముందస్తుగా వేరుశనగ సాగు చేసే అవకాశం ఉన్నందున వారికి విత్తనం అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు.

బోర్లకింద భూముల్లో ముందస్తుగా..

ప్రభుత్వం అమలు చేసిన 'జలకళ' పథకంతో వందలాది మంది రైతులు బోర్లకు మోటర్లు ఏర్పాటు చేసుకున్నారు. వీరిలో 450 మంది రైతులు ఖరీఫ్ సాగుకు సిద్ధంగా ఉన్నారు. ఇప్పటికే భూములు దున్ని విత్తనానికి సిద్ధం చేశారు.

ఆశాజనకంగా వర్షాలు..

జిల్లాలో సాధారణ ఖరీఫ్ సాగు విస్తీర్ణం 2.30 లక్షల హెక్టార్లు కాగా, గత ఏడాది వర్షాభావ పరిస్థితుల వల్ల సాగు విస్తీర్ణం తగ్గింది. అయితే రబీలో సాగు విస్తీర్ణం బాగా పెరిగింది. ఈ సారి నైరుతీ రుతుపవనాలు గత ఏడాది కంటే ముందుగానే వస్తాయని వాతావరణ శాస్త్రవేత్తలు ప్రకటించిన నేపథ్యంలో రైతులు ఉత్సాహంగా పంటల సాగుకు సిద్ధమవుతున్నారు. దీంతో ఈ సారి ఖరీఫ్ విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది.

త్వరలో రిజిస్ట్రేషన్లు..


ఖరీఫ్‌లో వేరుశనగ సాగు చేసే రైతులకు సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేశాం. ఇందుకోసం త్వరలోనే రిజిస్ట్రేషన్లు ప్రారంభిస్తాం. అలాట్‌మెంట్, సేల్స్ ప్రైసెస్, సబ్సిడీ, పంపిణీ మార్గదర్శకాలు ఇంకా వెలువడాల్సి ఉంది. రెండు రోజుల్లో అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. – సుబ్బారావు, జిల్లా వ్యవసాయాధికారి

పోలీసుల అదుపులో మండల నాయకులు

యాడికి: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ సందర్భంగా తాడిపత్రి నియోజకవర్గంలో చోటు చేసుకున్న ఘర్షణలకు సంబంధించి ముందస్తు జాగ్రత్తగా పలువురు మండల నాయకులు, గ్రామ స్థాయి నాయకులను బుధవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బొంబాయి రమేష్ నాయుడు, సీనియర్ నాయకుడు బాలా రమేష్‌బాబుతో పాటు పలువురు కార్యకర్తలు ఉన్నారు. కాగా, విషయం తెలుసుకున్న టీడీపీ నాయకులు, కార్యకర్తలు అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు.

'వేసవి' దొంగలతో జాగ్రత్త


- అప్రమత్తతతో చోరీలకు అడ్డుకట్ట
- ప్రజలకు పోలీసుల సూచనలు



బత్తలపల్లి: వేసవి అంటే కేవలం ఉక్కపోత, వడదెబ్బే కాదు... దొంగతనాలు కూడా ఉంటాయి. జనం హాయిగా ఆరు బయటనో, మిద్దెపైనో నిద్రపోతుంటే దొంగలు ఎంచక్కా బీరువాలు తెరిచి సొత్తుతో ఉడాయిస్తుంటారు. వేసవిలో విహారయాత్రలు, తీర్థ యాత్రలకు, ఊళ్లకు వెళ్లే కుటుంబాలే లక్ష్యంగా దొంగలు చెలరేగుతారు. ఈ క్రమంలో అప్రమత్తంగా ఉంటే చోరీలకు అడ్డుకట్ట వేయవచ్చునని పోలీసులు అంటున్నారు. ఈ అంశంపై ప్రజలను చైతన్య పరుస్తున్నారు. ఇంతకు పోలీసులు చెబుతున్నదేమిటో పరిశీలిద్దామా....

- ఇంటి కిటికీలు మూసివేయాలి. వాటికి ఉన్న బోల్టులు సక్రమంగా ఉన్నాయో, లేదో ఎప్పటికప్పుడు చూసుకోవాలి.
- దుస్తుల్లో డబ్బులు పెట్టి కిటికీలకు, తలుపులకు తగిలించరాదు.
- ఆరు బయట, మిద్దెలపై నిద్రించే వారు అప్రమత్తంగా ఉండాలి. ఇంటికి ఒకటికి రెండు తాళాలు వేసుకోవాలి.
- బంగారు ఆభరణాలు ధరించి ఆరు బయట నిద్రించకూడదు. ఇంట్లో పడుకున్నా కిటికీలు తెరిచి ఉండే వైపు పడుకోరాదు.
- వీలైతే ఇంటి ఆవరణలో పెంపుడు కుక్కలను కట్టేయాలి. ఇంట్లో ఎలాంటి అలికిడి వినిపించినా వెంటనే అప్రమత్తం కావాలి. అలసత్వం ప్రదర్శించరాదు.
- అపరిచిత వ్యక్తుల వాహనాల్లో ప్రయాణించరాదు.
- దూర ప్రాంతాలకు వెళ్లే వారు తమ ఇంటి చిరునామా, ఫోన్ నంబర్‌ను సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు తెలపాలి.
- రాత్రి సమయంలో కొత్తవారు ఎవరైనా వస్తే వారి వివరాలు తెలుసుకుని నమోదు చేసుకోవడం మంచిది.
- అనుమానితులు ఎవరైనా కనిపిస్తే వెంటనే సంబంధిత పోలీసులకు సమాచారమివ్వాలి.
- ఇంట్లోని బంగారు నగలు, నగదును బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవడం ఉత్తమం.

చోరీల నియంత్రణకు చర్యలు



వేసవిలో చోరీల నియంత్రణకు అన్ని చర్యలు చేపట్టాం. ప్రజలను అప్రమత్తం చేస్తున్నాం. రాత్రి వేళల్లో గస్తీ ఏర్పాటు చేశాం. అనుమానితులను అదుపులోకి తీసుకుంటున్నాం. ఈ విషయంలో ప్రజలు కూడా జాగ్రత్తలు తీసుకోవాలి.
– పి.శ్రీనివాసులు, ఎస్‌ఐ, బత్తలపల్లి

టీబీ డ్యాంలో 3.4 టీఎంసీల నీరు


తుంగభద్ర జలాశయం

బొమ్మనహాళ్: ఆంధ్రా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి రిజర్వాయర్, అనంతపురం జిల్లా పశ్చిమ ప్రాంత ప్రజలకు వరప్రదాయిని అయిన తుంగభద్ర డ్యాంలో బుధవారం నాటికి 3.4 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యాం సామర్థ్యం 1,633 అడుగులు కాగా, 1,577.59 అడుగుల మేర నీరు నిలిచి ఉంది. ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో లేదు. గత ఏడాది ఇదే సమయానికి 3.44 టీఎంసీల నీరు నిల్వతో 1,868 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 215 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండింది.

అక్కమాంబ ఆలయంలో చోరీ


దుండగుల చేతిలో ధ్వంసమైన హుండీ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణ సమీపంలో వెలసిన మహిమాన్విత అక్కమాంబ ఆలయంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఈ ఏడాది ఉగాది నాడు అత్యంత వైభవంగా అక్కమాంబ జాతర నిర్వహించారు. అప్పటి నుంచి ఆలయ హుండీని లెక్కింపు చేపట్టలేదు. ఈ క్రమంలో గురువారం హుండీలోని భక్తుల కానుకలను లెక్కించేందుకు ఆలయ కమిటీ సభ్యులు సిద్ధమయ్యారు. ఇంతలో మంగళవారం అర్ధరాత్రి ఆలయంలోకి చొరబడిన దుండగులు హుండీని ధ్వంసం చేసి అందులోని కానుకలను అపహరించుకెళ్లారు. ఆలయంలోని సీసీ కెమెరాలు పనిచేయక పోవడంతో ఇంటి దొంగల పనిగానే పలువురు అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఆలయాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి


ప్రసాద్ మృతదేహం

గుంతకల్లు టౌన్: స్థానిక అంకాలమ్మ గుడి వీధికి చెందిన బోయ ప్రసాద్ (40) బుధవారం అనుమానాస్పద స్థితిలో మృతదేహమై కనిపించాడు. వివరాలు... బేల్దారి పనులతో జీవనం సాగిస్తున్న ప్రసాద్‌కు భార్య కవిత, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మంగళవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఆయన రాత్రైనా ఇంటికి చేరుకోలేదు. కుటుంబసభ్యులు ఎన్ని సార్లు ఫోన్ చేసినా స్పందించలేదు. బుధవారం ఉదయం పొలం పనులకు వెళుతున్న వ్యవసాయ కూలీలు నల్లరేగడి పొలంలో పడి ఉన్న ప్రసాద్ మృతదేహాన్ని గమనించి సమాచారం ఇవ్వడంతో కుటుంబసభ్యులతో పాటు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. మృతుడి గొంతుపై ఉన్న రక్తపు గాట్లు, ముక్కులో నుంచి రక్తం కారడాన్ని బట్టి హత్య చేసి ఉంటారని కుటుంబసభ్యులు ఆరోపించారు. మృతుడి తండ్రి లక్ష్మణ్ణ ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

మమ్మల్నే ప్రశ్నిస్తావా?

- వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై దాడి చేసిన టీడీపీ నేతలు


గాయపడిన బేల్దారి శివ

గుంతకల్లు: రయ్యిమంటూ వీధిలో ద్విచక్ర, వాహనాలు నడుపుతూ స్థానికులను ఎందుకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ప్రశ్నించిన ఓ వైఎస్సార్‌సీపీ కార్యకర్తపై టీడీపీ నేతలు విచక్షణారహితంగా దాడి చేశారు. వివరాలు... మంగళవారం అర్ధరాత్రి టీడీపీకి చెందిన పలువురు ఫుల్‌గా మద్యం సేవించి ఐదారు ద్విచక్ర వాహనాల్లో చక్కర్లు కొడుతూ 17వ వార్డులోని నామాల్‌సేట్ కల్యాణమంటపం సమీపంలో ఉన్న నాగలయ్య కట్ట వీధికి చేరుకున్నారు. మద్యం మత్తులో కేకలు వేస్తూ ద్విచక్ర వాహనాలను ఇష్టానుసారంగా రైజ్ చేస్తుండడంతో భారీ శబ్దం వెలువడింది. దీంతో ఇంటి నుంచి బయటకు వచ్చిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త బేల్దారి శివ వారిని అడ్డుకున్నారు. అర్ధరాత్రి సమయంలో ఇలా చేయడం సబబు కాదని హితవు పలికారు. మమ్మల్నే ప్రశ్నిస్తావా? అంటూ పచ్చ మూకలోని సూరి, గోవిందు, హరి, కిషోర్, తేజు తదితరులు శివ మీద విరుచుకుపడ్డారు. సిద్ధంగా ఉంచుకున్న ఇనుప రాడ్లతో కింద పడేసి కొట్టారు. శివ అరుపులకు చుట్టుపక్కల ఇళ్లలోని వారు నిద్రలేచి రావడం గమనించిన పచ్చమూక అక్కడి నుంచి ఉడాయించింది. తీవ్ర రక్తగాయాలతో ఉన్న శివను వెంటనే వార్డు వైఎస్సార్‌సీపీ నాయకుడు కేవీ వాసు, ఇతరులు స్థానిక ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుడి ఫిర్యాదు మేరకు రెండో పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

ఒకరి కోసం వచ్చి మరొకరిపై దాడి?

పచ్చమూక ప్రణాళిక ప్రకారం ఇనుప రాడ్లతో వీధిలో తిరగడంపై పలు అనుమానాలు వ్యక్తమయ్యాయి. పోలింగ్‌కు రెండు రోజుల ముందు 17వ వార్డుకు చెందిన టీడీపీ నాయకులు డబ్బుతో పాటు మద్యం పంపిణీ చేస్తుంటే వైఎస్సార్‌సీపీ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అంతేకాక 13వ తేదీ జరిగిన పోలింగ్‌లో టీడీపీకి వ్యతిరేకంగా వార్డు ప్రజలు ఓటు వేశారన్న అనుమానాలు కూడా తోడయ్యాయి. దీనికి కారకులైన వారిని లక్ష్యంగా చేసుకుని దాడికి టీడీపీ నేతలు పథకం రచించినట్లుగా తెలుస్తోంది.